

సోమశిలలో 51.534 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 51.534 టీఎంసీల నీటి నిల్వ ఉంది. దిగువ కాలువలకు 1250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,02,040
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.9.290
3 శాతం జీఎస్టీతో	రూ.9,569
నవర (8 గ్రా)	రూ.76,552

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.8 /27.6

జిల్లాలో బుధవారం కూడా అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని ఆ శాఖ అధికారులు తెలిపారు. మంగళవారం గాలిలో తేమ 64 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

జగనన్న లేఅవుట్ల ఆక్రమణకు యత్నం



జలదంకి: మండలంలోని రామవరప్పాడులో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్లను ఆక్రమించేందుకు ఆ గ్రామానికి చెందిన ఓ చోటా టీడీపీ నేత ప్రయత్నాలు ప్రారంభించాడు. నాలుగు రోజులుగా లేఅవుట్ల స్థలాల హద్దురాళ్లను తొలగించారు. అక్కడ నివేశన స్థలాల అభివృద్ధి పనులకు సంబంధించి ఆవిష్కరించిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. ఇటీవల ఆ లేఅవుట్లో పెరిగిన చిల్లచెట్లను సైతం నరికేసి సుమారు రూ.3 లక్షల మేర సొమ్ము చేసుకున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా, పంచాయతీ అధికారులు సైతం మౌనంగా ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2.3 ఎకరాల విస్తీర్ణంలో 64 మంది నిరుపేదలకు నివేశన స్థలాలు మంజూరు చేసి, ఇంటి పట్టాలను అందజేసింది. ఆ స్థలాలను దౌర్జన్యపూరితంగా ఆక్రమించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను అధికారులు, ప్రజాప్రతినిధులు అడ్డుకోవాల్సిన అవసరం ఉంది.

వీఆర్‌కు కలువాయి ఎస్‌ఐ

నెల్లూరు (క్రైమ్): విధుల్లో నిర్లక్ష్యం, పలు కారణాల నేపథ్యంలో కలువాయి ఎస్‌ఐ సుమన్‌ను వీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ జి. కృష్ణకాంత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరిని నియమించలేదు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

నెల్లూరు (టౌన్): ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజు గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు ఆర్‌ఐఓ ఆదూరు శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ ఫీజు గడువు పెంపు విషయాన్ని విద్యార్థులకు తెలియజేయాలన్నారు.

అదనపు కమిషనర్‌కు ఎఫ్‌ఏసీ బాధ్యతలు



వైఓ నందన్

నెల్లూరు (బారకాసు): నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా ఉన్న వైఓ నందన్‌ను ఇన్‌చార్జి కమిషనర్‌గా నియమించిన ప్రభుత్వం, తాజాగా పూర్తి అదనపు బాధ్యతలతో కమిషనర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ తదుపరి చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో నందన్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

దోపిడీ ఖనిజం



- ముఖ్యనేతకు భారీగా కమీషన్లు
- ఉదయగిరిలో అక్రమ మైనింగ్, గ్రావెల్ తవ్వకాలు
- అనుమతి లేకుండా తరలిస్తే క్షణాల్లో వాహనాలు సీజ్

వరికుంటపాడు మండలంలో అక్రమంగా తవ్వుతున్న క్వార్ట్జ్

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అవినీతి, అక్రమాలు తార స్థాయికి చేరాయి. జనాలు ఏమనుకుంటారో అనే జ్ఞానం కూడా మరిచి అందిన మేరకు దోచుకుంటున్నారు. ముఖ్యంగా ప్రకృతి వనరులపై కన్నేశారు. భవిష్యత్ తరాల అవసరాలు గురించి ఆలోచించకుండా దోచేస్తున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో జరుగుతున్న తంతు ఇది.

సాక్షి టాస్క్‌ఫోర్స్: జిల్లాలో ఉదయగిరి నియోజకవర్గంలో అపారమైన ఖనిజ సంపద ఉంది. కొన్నేళ్ల నుంచి ఈ సంపదను కొంతమంది అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా దోచేస్తున్నారు. అయితే గతంలో వీరికి రాజకీయ నేతల అండదండలు ఉన్నా.. తెరవెనుక మాత్రమే ఉండేవారు. పబ్లిక్‌కు తెలియకుండా జాగ్రత్తలు తీసుకునేవారు. కానీ నేడు అందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. సహజ వనరులపై కన్నేసిన ముఖ్యనేత ఎన్నికల తర్వాత ఆ వ్యాపారుల చేత పనులు బంద్ చేయించారు. ఇల్లీగల్ వ్యాపారాలు నడపాలంటే ముఖ్యనేత కార్యాలయంలో కప్పం కట్టాల్సిందే అని హుకుం జారీ చేశారు. దీనిని సీరియస్‌గా తీసుకోని కొంతమంది వ్యాపారులు మైనింగ్, గ్రావెల్ తవ్వకాలు సాగించారు. దీంతో ఆగ్రహించిన సదరు ముఖ్యనేత పోలీసులను ఉసిగొల్పి బంద్ చేయించారు. ముఖ్యనేత కార్యాలయాన్ని సంప్రదించి సెటిల్ చేసుకోండి అని పోలీసులు తెగేసి చెప్పారు. దాంతో ఆ నేత కార్యాలయాన్ని సంప్రదించి కప్పం కట్టి తమ ఇల్లీగల్ వ్యాపారాలను లీగల్ చేసుకున్నారు. ఈ క్రమంలో వింజమూరు మండలం నల్లగొండ్లలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు చేసే కాంట్రాక్టర్ జిల్లాలో ఒక మంత్రి ముఖ్య అనుచరుడు. మంత్రి అండతో ముఖ్యనేతను పట్టించుకోలేదు. దీంతో తనను సంప్రదించకుండా గ్రావెల్ తరలించడపై ఆగ్రహం చెంది స్వయంగా రంగ ప్రవేశం చేసి హంగామా చేశారు. సహజ సంపదను అన్యాయంగా బయట వ్యక్తులు దోచేస్తున్నారంటూ మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యనేత కార్యాలయంతో డీల్ ఓకే చేసుకొని ఉంటే ఈ హంగామా ఉండేది కాదు. గుట్టు చప్పుడు కాకుండా అంతా సవ్యంగా సాగిపోయేదని రాజకీయ పరిశీలకులు చర్చించుకుంటున్నారు. లోగుట్టు తెలియని జనం దృష్టిలో ఆ ముఖ్యనేత హీరోగా మారారు.

మిగతా అన్యాయాల సంగతేమిటీ

నియోజకవర్గంలో ఎక్కడైనా ముఖ్యనేత కార్యాలయం అనుమతి లేకుండా గ్రావెల్ తవ్వకాలు జరిగితే పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు వాలిపోతున్నారు. దీంతో తమ ఇంటి అవసరాల కోసం కావాల్సిన గ్రావెల్‌కు ముఖ్య కార్యాలయం అనుమతి పొందే అవకాశం లేక పేదలు ఇబ్బంది పడుతున్నారు. గత నెలలో వింజమూరు చెరువు నుంచి రాత్రి పగలు తేడా లేకుండా ముఖ్యనేత బసచేసే ఇంటి ముందు నుంచి లేఅవుట్లకు గ్రావెల్ తరలించారు. అప్పుడు ఆ నేతకు అన్యాయం అనిపించలేదా? అని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు. ఉదయగిరి, వింజమూరు, దుత్తలూరు తదితర ప్రాంతాల్లో లేఅవుట్లకు గ్రావెల్ అక్రమంగా తరలించిన వారిపై చర్యలు తీసుకోకపోవడం వెనుక ఉన్న రహస్యం ఏమిటి అనే ప్రశ్న తలెత్తుతోంది. కావలి నుంచి సీతారామపురం వరకు జాతీయ రహదారి పనులు కోసం నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ తరలించినా ముఖ్యనేత కార్యాలయం మౌనం దాల్చడం వెనుక ఆంతర్యం ఏమిటని జనం ప్రశ్నిస్తున్నారు.

వీటికి జవాబులేవి?

- వరికుంటపాడు మండలంలో రూ.కోట్లు విలువ చేసే అగ్రిగోల్డ్ భూముల్లో కలప యథేచ్ఛగా తరలిస్తున్న వైనం మీడియాలో వచ్చినా ఆ ముఖ్యనేతకు అది అన్యాయంగా కనిపించ లేదా. ఘటన ప్రాంతం సందర్శించి వాస్తవాలు విచారించి అక్రమార్కులపై చర్యలు చేపట్టకపోవడం వెనుక గుట్టు ఏమిటి? అని అగ్రిగోల్డ్ బాధితుల ప్రశ్న.
- ఉదయగిరి ఆనకట్ట ఆధునికీకరణ పనుల్లో రూ.50 లక్షలు ముఖ్యనేత చెంతకు చేరినట్లు అధికార పార్టీకి చెందిన ఓ కార్యకర్త లేఖ రూపంలో సోషల్ మీడియాలో వైరల్ చేశారు. రూ.9 కోట్లు అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పనులను ప్రతిపక్ష పార్టీకి చెందిన ఓ నేత వద్ద రూ.భారీ మొత్తంలో కమీషన్ తీసుకొని పనులు అప్పగించడంపై లేఖలో ప్రశ్నించారు. ఈ ఆరోపణలపై ముఖ్యనేత నోరు మెదపలేదు.
- జాతీయ ఉపాధి పథకంలో భాగంగా ఇటీవల పలు సీసీ రోడ్లు తన మిత్రుడి చేత చేయించారని, వాటికి ఉపయోగించిన మెటల్, ఇసుక జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టిన కంట్రాక్టర్ల నుంచి తీసుకొని పనులు పూర్తి చేసి వచ్చిన బిల్లులు ఆ ముఖ్యనేత జేబుల్లోకి వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. ఇది అక్రమమా... సక్రమమా అనేది డాలర్ల ప్రశ్న. అదే విధంగా వరికుంటపాడు మండలం కనియంపాడు అటవీ ప్రత్యామ్నాయ వనీకరణ పథకంలో చేపట్టిన పనుల్లో ముఖ్యనేత పార్టీ కార్యాలయానికి అటవీ అధికారులు కమీషన్లు ముట్టిచెప్పినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



నల్లగొండలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు

రేపు పంచాయతీరాజ్ దినోత్సవం

నెల్లూరు (పొగతోట): జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 24న ఉదయం 10 గంటలకు జెడ్పీ కార్యాలయంలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ విద్యారమ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

జూనియర్ సివిల్ జడ్జీల బదిలీ

నెల్లూరు (లీగల్): జిల్లాలోని వివిధ కోర్టుల్లో జూనియర్ సివిల్ జడ్జీలను బదిలీ, నియామకాలు చేస్తూ ఏపీ హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.అఖిలను ప్రకాశం జిల్లా అద్దంకి జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేయగా, ఆ స్థానంలో కర్నూలు జిల్లా కోయలకుంట్ల జూనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ రెహమాన్‌ను నియమించారు. నెల్లూరు 4వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ టి. భాస్కర్‌ను కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేయగా, ఈ స్థానంలో ప్రకాశం జిల్లా చీరాల మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి నిషార్ నాజ్ షేక్‌ను నియమించారు. 5వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ జి. దేవికను విజయవాడ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. స్పెషల్ మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ ఎల్. లావణ్యను విశాఖపట్నం జిల్లా మాడుగుల కోర్టు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. స్పెషల్ ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ టి. సుయొదన్‌ను కడప జిల్లా రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. గూడూరు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి. లోకనాథం అనంతపురం జిల్లా కదిరి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. వెంకటగిరి కోర్టు మేజిస్ట్రేట్ ఓ. అనూషను కృష్ణా జిల్లా నూజివీడు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ కాగా, ఈ స్థానంలో చిత్తూరు జిల్లా నగిరి జూనియర్ సివిల్ జడ్జిని నియమించారు. కోట కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ భరత్‌కుమార్‌ను కడప జిల్లా లక్కిరెడ్డిపల్లి కోర్టు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. నాయుడుపేట కోర్టు జూనియర్ సివిల్ జడ్జి పి. సంయుక్తను సూళ్లూరుపేట కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌గా బదిలీ చేశారు. ఈ స్థానంలో బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్. అనూషను కర్నూలు మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్‌గా బదిలీ చేశారు. కోవూరు కోర్టు మేజిస్ట్రేట్ జె. కాత్యాయని ప్రకాశం జిల్లా చీరాల కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు.

మే 5 నుంచి సాగుకు నీరు

సోమశిల: జిల్లా జలనిధి సోమశిల జలాశయం నుంచి రెండో పంటకు మే 5వ తేదీ నుంచి సాగునీరు విడుదల చేస్తామని జలాశయం ఎస్‌ఈ బసిరెడ్డి వెంకట రమణారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ ఏడాది పైతట్టు ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు జిల్లా రైతాంగానికి పుష్కలంగా సరిపడా నీరు వచ్చి చేరిన నేపథ్యంలో రెండు పంటకు సాగునీరు అందించేందుకు ఐఏబీ సమావేశంలో ఉన్నతాధికారులు నిర్ణయించారని, ప్రస్తుతం జలాశయంలో 50 టీఎంసీల నీరు ఉన్నందున జలాశయం నుంచి జిల్లా రైతాంగానికి 40 టీఎంసీల నీటిని వ్యవసాయానికి ఉపయోగించుకునేందుకు నిర్ణయించారన్నారు. ఉత్తర కాలువకు 50 కి.మీ. వరకు 35 వేల ఎకరాలకు, కావలి కాలువ 74 వేల ఎకరాలకు ఆరు తడి పంటలకు నీరు అందిస్తామన్నారు. పెన్నా డెల్టాకు ఇరిగేషన్ అధికారులు నిర్ధారిస్తారన్నారు. ఈ కాలువల కింద వ్యవసాయం చేసే రైతులు ప్రతి నీటి బొట్టును ఉపయోగించుకుని వృథా చేయకుండా వాడుకోవాలని తెలిపారు. రెండో పంటకు అందిస్తున్న కారణంగా రైతులందరూ వరి పంట పైనే మొగ్గు చూపకుండా వేరుశనగ, పొద్దు తిరుగుడు వంటి పంటలను వేసి నీటిని ఆదా చేస్తే పంటలకు ఉపయోగించుకోవచ్చునని, అవసరం ఉంటేనే నీటిని వాడుకోవాలని రైతులకు సూచించారు.

సంపూర్ణ అక్షరాస్యతకు సమష్టి కృషి



మాట్లాడుతున్న కలెక్టర్ ఓ. ఆనంద్

- కలెక్టర్ ఓ ఆనంద్

కోవూరు: జిల్లాలో అక్షరాస్యత శాతం పెంచేందుకు ఒక నియోజకవర్గాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకుని నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ప్రణాళిక చేపట్టామని, అన్ని శాఖల అధికారులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. అందులో భాగంగా జిల్లాలో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చొరవతో ఈ నియోజకవర్గాన్ని ఎంపిక చేశామని తెలిపారు. మంగళవారం కోవూరు ఐసీడీఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. నియోజకవర్గంలో మొత్తం 22,000 మంది నిరక్షరాస్యులను గుర్తించామని, వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే కాకుండా, ఎంపిక చేసిన వారికి నేరుగా పనుల్లో మస్టర్ వేసే విధానం, బ్యాంకింగ్ కార్యకలాపాలు, ప్రభుత్వ కార్యక్రమాల విధివిధానాలపై అవగాహన కల్పిస్తామన్నారు. 90 రోజుల ప్రణాళికలో భాగంగా అక్షరాలు నేర్పించడమే కాకుండా ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యతలో మెళకువలు నేర్పిస్తామన్నారు. ఇందుకోసం 2,500 మంది స్వచ్ఛంద ఉపాధ్యాయులను నియమించామన్నారు. కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా భావించకుండా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే యజ్ఞంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. నిరక్షరాస్యులకు వారి రోజువారి పనులకు ఆటంకం కలగకుండా వారికి అనువైన సమయంలోనే అక్షరాలు నేర్పిస్తామన్నారు. ఇందుకోసం గుర్తించిన కమ్యూనిటీ మొబిలైజర్లు తమ వంతు కృషి చేసి ప్రతి ఒక్కరు ప్రతి రోజు హాజరయ్యే విధంగా బాధ్యత తీసుకోవాలన్నారు.

విజయవంతం చేయండి

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గం చైతన్య వంతమైందని, గతంలో చేపట్టిన క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు విజయవంతంగా జరిగాయన్నారు. తాజాగా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చే కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. ఇందుకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వీపీఆర్ ట్రస్ట్ ద్వారా సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య డీడీ మహమ్మద్ అజాద్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి, జెడ్పీ సీఈఓ విద్యారమ, డ్వామా పీడీ గంగాభవాని, డీఈఓ బాలాజీ రావు, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, కోవూరు సర్పంచ్ విజయలక్ష్మి, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌ఓలను క్రమబద్ధీకరించాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సీహెచ్‌ఓలు

నెల్లూరు (అర్బన్): దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, తమ సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని కోరుతూ జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌లు (సీహెచ్‌ఓలు) మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. సీహెచ్‌ఓల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భానుమహేష్, కృష్ణవేణి మాట్లాడుతూ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల్లో జిల్లాలో 497 మంది పని చేస్తున్నామన్నారు. నాలుగున్నరేళ్ల పాటు బీఎస్సీ నర్సింగ్, మరో రెండేళ్ల పాటు ఎమ్మెస్సీ నర్సింగ్ కోర్సులు పూర్తి చేసి వైద్యశాఖలో చేరామన్నారు. నడవలేని వృద్ధులు, పక్షవాతం పెషేంట్ల ఇళ్ల వద్దకే వెళ్లి 12 రకాల వైద్య సేవలు, 14 రకాల పరీక్షలు గ్రామీణ స్థాయిలో అందిస్తున్నామన్నారు. తమకు ప్రభుత్వం కేవలం రూ. 25 వేలను మాత్రమే జీతంగా ఇస్తుందన్నారు. తమకు వచ్చే జీతంలోనే సొంత ఖర్చులు పెట్టుకుంటూ వివిధ రకాల శిక్షణలకు, ఆరోగ్య కార్యక్రమాలకు హాజరవుతున్నామన్నారు. ఆస్పత్రులకు తరలించే మెటీరియల్‌ను జిల్లా కేంద్రాల నుంచి తమ సొంత ఖర్చులతోనే తీసుకెళ్తున్నామన్నారు. క్లినిక్‌ల అద్దెలు కూడా ప్రభుత్వం 10 నెలలుగా చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలుచోట్ల యజమానుల ఒత్తిడి తట్టుకోలేక సీహెచ్‌ఓలే క్లినిక్‌ల అద్దెలు కూడా చెల్లిస్తున్నారన్నారు. రకరకాల కారణాలు చెప్పి ఇన్సెంటివ్స్‌కు కూడా కోత వేశారన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని, ఆయుష్మాన్ భారత్ కింద ఉద్యోగ భద్రత కల్పించాలని, జాబ్ చార్ట్ ప్రకారమే విధులు కేటాయించాలని కోరారు. ఈపీఎఫ్‌ను పునరుద్ధరించాలని, సీహెచ్‌ఓలకు ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు మినహాయింపు నివ్వాలని కోరారు. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే నిరాహార దీక్షలు, ఆందోళనలు చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టరేట్ అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. ఆ సంఘం నాయకులు ఆదిల్, రెబికా, సుమాంజలి, రమ, అన్ని మండలాల నుంచి వచ్చిన సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలల్లో

పూర్తిస్థాయిలో వసతులు

- 10 కేజీబీవీల్లో అదనపు తరగతి గదులు, టాయిలెట్స్
- సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య



మాట్లాడుతున్న ఏపీసీ వెంకటసుబ్బయ్య

నెల్లూరు (టౌన్): వార్షిక వర్క్ ప్లాన్ బడ్జెట్ 2024–25లో భాగంగా పలు ప్రాథమిక పాఠశాలల్లో అదనపు గదులు నిర్మాణాలు, టాయిలెట్స్, ప్రహరీల నిర్మాణాలు చేపట్టనున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని ఆయా పాఠశాలల్లో 19 అదనపు గదుల నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. ఒక్కో గదికి రూ.13.05 లక్షలు నిధులు మంజూరైనట్లు వివరించారు. 15 బాలుర, 10 బాలికల టాయిలెట్స్ నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. ఒక్కో టాయిలెట్‌కు రూ.3.80 లక్షలు నిధులు మంజూరైనట్లు చెప్పారు. జిల్లాలోని 23 పాఠశాలల్లో ప్రహరీలు నిర్మించనున్నామని, ఒక్కో స్కూల్లో 125 మీటర్లు పొప్పున ప్రహరీ నిర్మాణాన్ని చేపడుతామన్నారు. ఒక్కో స్కూల్‌కు రూ.9.31 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. జిల్లాలోని సాయిపేట, వడ్డిపాళెం ఎంపీపీఎస్‌ల్లో రూ. 12 లక్షలతో మేజర్ వర్క్స్‌ను చేపట్టనున్నట్లు వివరించారు. పంచేడు, పల్లిపాడు ఎంపీపీఎస్‌ల్లో రూ.3 లక్షలతో ఎలక్ట్రికల్ పనులు చేపడుతున్నామన్నారు. మనబడి మన భవిష్యత్‌లో భాగంగా జిల్లాలోని 10 కేజీబీవీల్లో ఇంటర్మీడియట్ విద్య కోసం భవన నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. ఒక్కో కేజీబీవీలో 6 అదనపు గదులు, 10 టాయిలెట్స్‌తో పాటు పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఒక్కో కేజీబీవీకి రూ.2.55 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఆయా కేజీబీవీల్లో మిగిలిన నాడు–నేడు పనులను సమగ్రశిక్ష ఆధ్వర్యంలో పూర్తి చేయనున్నట్లు చెప్పారు.

పేదల బియ్యంపై ఆధిపత్య పోరు

రేషన్ బియ్యం అక్రమ వ్యాపారంలో పాత, కొత్త వారి మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. ప్రభుత్వం తమదేనంటూ అధికార పార్టీ నాయకులు బియ్యం వ్యాపారం మొత్తాన్ని చేతుల్లోకి తీసుకున్నారు. దానిని దెబ్బతీసేందుకు కొందరు పాత వ్యాపారులు ప్రయత్నించి భంగపడుతున్నారు. ప్రస్తుతం కందుకూరు నియోజకవర్గంలో బియ్యం వ్యాపారుల మధ్య జరుగుతున్న పోరు చర్చనీయాంశంగా మారింది.

- నియోజకవర్గంలో ఎవరూ ఆ బిజినెస్ చేయరాదంటూ హుకుం
- ఎదురు తిరుగుతున్న పాత వ్యాపారులు
- గుట్టు రట్టు చేసేందుకు జట్టు కట్టిన వైనం
- అడ్డు తగులుతున్న వారిపై కేసులతో వేధింపులు

▸ వ్యాపారాన్ని ఆధీనంలోకి తీసుకున్న అధికార పార్టీ నేతలు



కందుకూరు: లింగసముద్రం మండలం పెదపవని గ్రామాన్ని కేంద్రంగా చేసుకుని అధికార పార్టీ నాయకులు భారీగా బియ్యం వ్యాపారం చేస్తున్నారు. ప్రతి నెలా రేషన్ డీలర్ల దగ్గర సేకరించిన బియ్యాన్ని నేరుగా గ్రామంలోని మిల్లుకు తరలించి అక్కడి నుంచి కృష్ణపట్నం పోర్టు, చెన్నై ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇదంతా బహిరంగ రహస్యమే. ఇందుకోసం నియోజకవర్గంలో మండలానికి ఒక నాయకుడిని నియమించారు. అక్కడ బియ్యం వ్యాపారం మొత్తం వీరి కనుసన్నల్లోనే జరిగేలా అధికార పార్టీ నాయకులు ఏర్పాట్లు చేసుకున్నారు. నియోజకవర్గంలో పేద ప్రజలకు బియ్యం పంపిణీ చేయకుండానే నేరుగా బ్లాక్‌మార్కెట్‌కు తరలించేస్తున్నారు. డీలర్లు ఒక కేజీని రూ.12 లెక్కన జనాల వద్ద కొనుగోలు చేస్తారు. తర్వాత వాటిని రూ.16 లెక్కన డీలర్ల వద్ద నుంచి వ్యాపారులు కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్‌కు పంపుతారు. వందల టన్నుల బియ్యాన్ని అసలు రేషన్ షాపులకు చేర్చకుండానే సివిల్ సప్లయ్స్ గోదాము నుంచి నేరుగా తరలిస్తున్నారు. నెలలో కనీసం 18వ తేదీ వరకు బియ్యం పంపిణీ చేయాల్సి ఉన్నా అలా జరగడం లేదు. ఒకటి, రెండు తేదీల్లోనే సరుకుని తరలించిన అనంతరం లబ్ధిదారుల వద్ద వేలిముద్రలు తీసుకుని డబ్బులిచ్చి పంపుతున్నారు. ఈ ప్రక్రియలో బియ్యం వ్యాపారం చూస్తున్న అధికార పార్టీ నాయకులు చెప్పిన విధంగానే డీలర్లు వ్యవహరించాలి. వారికి తప్ప బియ్యాన్ని మరొకరికి అమ్మడానికి వీల్లేదు. దీంతో దశాబ్దాల తరబడి ఇదే వ్యాపారం చేస్తున్న బియ్యం వ్యాపారుల ఆదాయానికి గండి పడింది.

పోలీసుల వేధింపులు

తమను వ్యాపారం చేసుకోనివ్వడం లేదంటూ పాత వ్యాపారులు ఒక జట్టుగా ఏర్పడ్డారు. అధికార పార్టీకి చెందిన నేతల వ్యాపారాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. వారు బియ్యం నిల్వ చేసే స్థావరాలపై, రవాణా చేసే వాహనాలపై నిఘా ఉంచి అధికారులకు సమాచారం ఇవ్వడం ప్రారంభించారు. అక్రమంగా బియ్యం తరలిస్తున్నారని, మిల్లులో భారీ ఎత్తున నిల్వ చేసి ఉన్నారని అధికారులకు ఫోన్లు చేయడం మొదలుపెట్టారు. ఇటీవల పెదపవని కేంద్రంగా నడుస్తున్న మిల్లుపై నిఘా ఉంచి జిల్లా ఉన్నతాధికారుల దగ్గర నుంచి స్థానిక అధికారుల వరకు ఫోన్లు చేశారు. అయితే దాడులు చేసేందుకు అధికారులెవరూ ముందుకు రాలేదు. అధికార పార్టీకి చెందిన వ్యవహారం కావడంతో వెనుకంజ వేస్తున్నారు. పైగా కొందరు ఏ నంబర్ నుంచి ఫోన్ వచ్చింది బియ్యం వ్యాపారులకు తెలియజేస్తున్నారు. దీంతో ప్రతీకారం తీర్చుకునేందుకు నేతలు చర్యలు ప్రారంభించారు. పోలీసులను రంగంలోకి పాత వ్యాపారులు బియ్యం తరలించే వాహనాలను పట్టుకోవడం, కేసులు నమోదు చేయించడం, వారిని స్టేషన్‌కు పిలిపించి వేధించడం పరిపాటిగా మారిపోయింది. ఇటీవల ఉలవపాడు స్టేషన్‌లో చోటు చేసుకున్న ఉదంతమే ఇందుకు నిదర్శనం. సింగరాయకొండకు చెందిన ఒకతను కందుకూరు ప్రాంతంలో బియ్యం కొని వ్యాపారం చేస్తుంటాడు. ఈ వాహనాన్ని పట్టుకున్న ఉలవపాడు పోలీసులు అతడిపై వేధింపులకు దిగారు. పాత కేసులను ఆసరాగా చేసుకుని సస్పెక్ట్ షీట్‌ను కూడా తెరిచారు. అలాగే లింగముద్రం మండలం వీఆర్ కోటకు చెందిన మరో వ్యాపారిపై కూడా గుడ్లూరు పోలీసులు వేధింపులకు పాల్పడుతున్నారు. అధికార పార్టీ నేతలు చేస్తున్న బియ్యం వ్యాపారానికి అడ్డు తగులుతుండటమే వీరిపై వేధింపులకు కారణం. దీంతో కొందరు వ్యాపారం మానుకోగా, మరికొందరు అధికార పార్టీ వ్యాపారులతో రాజీ కుదుర్చుకున్నట్లు సమాచారం.

చర్యలు లేకపోవడంతో..

సాధారణంగా ప్రతినెలా ఒకటి నుంచి 18వ తేదీ వరకు బియ్యం పంపిణీ చేయాల్సి ఉన్నా నెల మొదటి వారంలోనే రేషన్‌షాపుల నుంచి బియ్యం మొత్తం బ్లాక్ మార్కెట్‌కు తరలివెళ్తోంది. ఇటీవల ఇలాంటి ఘటన పట్టణంలోని ఉప్పుచెరువు రోడ్డులో సబ్‌కలెక్టర్ సాక్షిగా వెలుగు చూసినా ఎటువంటి చర్యలు లేకపోవడం గమనార్హం. దీంతో తమ ఇష్టారాజ్యంగా బియ్యాన్ని తరలించేస్తున్నారు.

క్లుప్తంగా

పరిశ్రమల ఏర్పాటుకు సకాలంలో అనుమతులు

- కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు జాప్యం లేకుండా సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా సకాలంలో అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ ఒ.ఆనంద్ ఆదేశించారు. మంగళవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తుల్లో పురోగతి, క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం మొదలైన అంశాలను పరిశ్రమల శాఖ జీఎం ప్రసాద్ వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువు కంటే ముందుగా అనుమతి ఇవ్వాలన్నారు. ప్రింటింగ్, రెడీమేడ్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో అధికారులు మహబూబ్‌బాషా, వెంకటరమణ, గంగాభవాని, అశోక్ కుమార్, కమిటీ సభ్యులు ఏపీకే రెడ్డి, ఒమ్మిన సతీష్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయాలపై పోలీసుల దాడులు

- అదుపులో ఐదుగురు వ్యక్తులు

నెల్లూరు(క్రైమ్): గంజాయి విక్రయాలపై నెల్లూరు సంతపేట పోలీసులు దాడులు చేసి ఐదుగురు విక్రేతలను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇటీవల అధిక శాతం నేరాలు మత్తులో జరుగుతుండటంతో నగర పోలీస్ అధికారులు దీనిపై దృష్టి సారించారు. పొర్లుకట్ట పెన్నానది సమీపంలో గంజాయి విక్రయాలు సాగుతున్నాయని మంగళవారం సంతపేట పోలీసులకు పక్కా సమాచారం అందింది. వారు వెంటనే అక్కడికి వెళ్లారు. పోలీసుల రాకను గమనించిన ఐదుగురు విక్రేతలు పరారవుతుండగా వెంబడించి పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సుమారు ఐదు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

టిడ్కో గృహాల్లో కార్డన్ సెర్చ్



సిబ్బందికి సూచనలిస్తున్న నగర డీఎస్పీ సింధుప్రియ

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు భగత్‌సింగ్ కాలనీ టిడ్కో గృహ సముదాయంలో ప్రతి ఇంటిని పోలీసులు జల్లెడ పట్టారు. నేరాలను కట్టడి చేసి ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు అందించేందుకు ఎస్పీ జి.కృష్ణకాంత్ చర్యలు చేపట్టారు. అందులో భాగంగా కార్డన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నారు. మంగళవారం నగర డీఎస్పీ పి.సింధుప్రియ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి టిడ్కో ఇళ్లలో తనిఖీలు చేశారు. ఇంటి యజమానితోపాటు కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను సేకరించారు. వాహన పత్రాలను పరిశీలించారు. పత్రాలు సక్రమంగా లేని 54 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలు, రెండు కార్లను స్వాధీనం చేసుకుని నవాబుపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నలుగురు పాతనేరస్తులను గుర్తించి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కార్డన్ సెర్చ్ నిర్వహణ ముఖ్య ఉద్దేశాన్ని డీఎస్పీ స్థానికులకు తెలియజేశారు. ప్రజలు తమవంతు బాధ్యతగా అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నగర ఇన్‌స్పెక్టర్లు కె.సాంబశివరావు, జి.దశరథరామారావు, రోశయ్య, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చంపేస్తాడన్న భయంతోనే..

- సుల్తాన్ హత్య కేసులో నిందితుల అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ సింధుప్రియ

నెల్లూరు(క్రైమ్): పెన్నా నది వద్ద జరిగిన సుల్తాన్ హత్య కేసులో నిందితులను నవాబుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం నగర డీఎస్పీ పి.సింధుప్రియ తన కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. జాకీర్‌హుస్సేన్ నగర్‌కు చెందిన షేక్ సుల్తాన్ (38) బేల్దారి పనులు చేస్తుంటాడు. మద్యానికి బానిసైన అతను పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. పలువురిని బెదిరించి నగదు దోచుకుని మద్యం తాగేవాడు. సుల్తాన్ హత్యపై బాధిత తల్లి కరిమున్నీసా ఫిర్యాదు మేరకు నవాబుపేట ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ కె.సాంబశివరావు నేతృత్వంలో ఎస్సైలు రెహమాన్, శివయ్య ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా నిందితులను జాకీర్‌హుస్సేన్ నగర్ న్యూకాలనీకి చెందిన షేక్ సలీం అలియాస్ కలీమ్, మైపాడు రోడ్డు సింహపురి కాలనీకి చెందిన ఎం.నాగరాజుగా గుర్తించారు. మంగళవారం వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈనెల 16వ తేదీన మద్యం తాగేందుకు డబ్బులివ్వాలని సలీంను సుల్తాన్ అడగ్గా అతను లేవని చెప్పాడు. దీంతో కోపోద్రిక్తుడైన సుల్తాన్ డబ్బులివ్వకుండా ఎలా బతుకుతావో చూస్తానని బెదిరించాడు. దీంతో బెదిరిపోయిన సలీం ఈ విషయాన్ని తన స్నేహితుడైన నాగరాజుకు తెలియజేశాడు. సుల్తాన్ చంపేందుకు వస్తే ఇద్దరం కలిసి అతడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. అదే రోజు రాత్రి సలీం, నాగరాజు న్యూకాలనీ సమీప పెన్నా నది వద్ద ఉండగా సుల్తాన్ వెళ్లి గొడవపడి దాడి చేశాడు. వారు కర్రలతో సుల్తాన్ తలపై కొట్టగా మృతిచెందాడు. నిందితులను అరెస్ట్ చేసిన ఏఎస్సై బీవీ నరసయ్య, హెచ్‌సీ ఎస్.ప్రసాద్, కానిస్టేబుళ్లు ఆర్వీ రత్నయ్య, సురేంద్రబాబు, గౌస్, మస్తానయ్య, వేణును డీఎస్పీ అభినందించారు.

విద్యుత్ మోటార్ల దొంగల అరెస్ట్

- రూ.5.5 లక్షల విలువైన 25 మోటార్ల స్వాధీనం



రికవరీ చేసిన మోటార్లను పరిశీలిస్తున్న పోలీసులు

తోటపల్లిగూడూరు: ఇనుప వ్యాపారం పేరుతో పగటి పూట గ్రామాల్లో తిరుగుతూ రాత్రి వేళల్లో పొలాల్లో మోటార్లను చోరీ చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం తోటపల్లిగూడూరు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్పీ సౌజన్య వివరాలు వెల్లడించారు. కొడవలూరు మండలం నార్తురాజుపాళెం గ్రామానికి చెందిన కత్తుల బాబీ, పొట్లూరు పూర్ణచంద్రరావు, చౌటూరు శ్రీను ముఠాగా ఏర్పడి విద్యుత్ మోటార్లు చోరీ చేస్తున్నారు. తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, ఇందుకూరుపేట, వెంకటాచలం, నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నాలుగు నెలల్లో వీరిపై 11 కేసులు నమోదయ్యాయి. నిందితుల నుంచి రూ.5.5 లక్షల విలువైన 25 మోటార్లను రికవరీ చేశారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. కాగా ఐదునెలల కాలంలో నెల్లూరు సబ్ డివిజన్‌లో చోరీకి గురైన 103 మోటార్లను రికవరీ చేశామని ఏఎస్పీ వెల్లడించారు. కేసులను ఛేదించి మోటార్లను రికవరీ చేయడంతోపాటు నిందితులను పట్టుకున్న పలు స్టేషన్ల పోలీస్ అధికారులు, సిబ్బందికి ఏఎస్పీ రివార్డులను అందజేశారు. కార్యక్రమంలో నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, కృష్ణపట్నం పోర్టు సీఐ రవినాయక్, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, కృష్ణపట్నం పోర్టు స్టేషన్ల ఎస్సైలు వీరేంద్రబాబు, విశ్వనాథరెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి వీఎస్‌యూలో సాఫ్ట్‌బాల్ పోటీలు



పోస్టర్లను ప్రదర్శిస్తున్న వీసీ తదితరులు

- వీసీ అల్లం శ్రీనివాసరావు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో ఈనెల 30 నుంచి మేనెల 8 తేదీ వరకు ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ (మహిళలు, పురుషులు) టోర్నమెంట్ జరుగుతుంది. దీనికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం కాకుటూరులో ఉన్న వర్సిటీలో వీసీ అల్లం శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి 93 మహిళా జట్లు 30 నుంచి మే నెల 3 తేదీ వరకు పాల్గొంటాయని తెలిపారు. మేనెల 4 నుంచి 8 తేదీ వరకు 95 పురుష జట్లు పోటీ పడతాయన్నారు. వీఎస్ యూ క్రీడా విభాగం ఆధ్వర్యంలో ఈ పోటీలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ హనుమారెడ్డి, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు, పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.మధుమతి తదితరులు పాల్గొన్నారు.

రేపు హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన జిల్లా పురుషుల జట్టు ఎంపిక చేస్తామని ఆ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.విక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని బోసుబొమ్మ వద్ద గల ఏబీఎం బాలికల హైస్కూల్లో మధ్యాహ్నం 3 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. ఎంపికైన జట్టు ఈనెల 26, 27వ తేదీల్లో అన్నమయ్య జిల్లా కదిరిలో జరిగే 54వ అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటుందన్నారు. వివరాలకు 98481 51639ని ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఉప్పు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- రాష్ట్ర సాల్ట్ సొసైటీ అసోసియేషన్ అధ్యక్షుడు బాలకృష్ణరాజు



కావలి: జిల్లాలో ఉప్పు సాగు చేస్తున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర సాల్ట్ సొసైటీ అసోసియేషన్ అధ్యక్షుడు అనంతరాజు బాలకృష్ణరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కావలిలో మీడియాతో మాట్లాడారు. ఉప్పు సాగు చేసే రైతులకు భూమిపై హక్కు లేదని, ప్రభుత్వ భూమి కావడంతో బ్యాంక్ రుణాలు మంజూరు కావడం లేదని చెప్పారు. ప్రైవేట్ వ్యక్తులు వద్ద అప్పు దొరక్క రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 2008లో అల్లూరు ఎమ్మెల్యేగా కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నప్పుడు సీఎం వైఎస్సార్‌ను కలిసి ఉప్పు రైతుల కష్టాలను తెలియజేసినట్లు చెప్పారు. ఆయన స్పందించి విద్యుత్ యూనిట్ రూ.4ను రూ.1కే ఇస్తానని చెప్పారన్నారు. తాము అడిగిన నాటికి మూడు నెలల ముందు నుంచే యూనిట్ రూ.1కే అందించేలా ఆదేశాలు జారీ చేశారన్నారు. అనంతరం వచ్చిన ప్రభుత్వాలు దీనిని రద్దు చేయడంతో మళ్లీ రైతులు విలవిల్లాడిపోయారన్నారు. నారా లోకేశ్ పాదయాత్ర చేస్తున్నప్పుడు ఉప్పు భూములకు పట్టాలివ్వాలని, రవాణా వసతులు, తాగునీటి వసతులు కల్పించాలని రైతులు కోరారన్నారు. రైతులు, కూలీలు సుమారు 10,000 మందికి పైగా ఉప్పు సాగుపై ఆధారపడి బతుకుతున్నారని తెలియజేశారు. అధికారంలోకి రాగానే అవసరమైన చర్యలు తీసుకుని మేలు చేస్తానని లోకేశ్ హామీ ఇచ్చారన్నారు. అయితే నేటికీ అమలుకు నోచుకోలేదని తెలిపారు. ఉప్పును భద్రపరుచుకోవడానికి వసతుల్లేవని చెప్పారు. అసలు ధర ఎంత అనేది రైతులకు తెలికపోవడంతో వ్యాపారులు, దళారులు ఎంత ధర చెబితే అంతకే అమ్మకాలు చేస్తున్నారన్నారు. బీమా సౌకర్యం కల్పిస్తే వర్షమొస్తే రైతులకు నష్టశాతం కొంత వరకైనా తగ్గుతుందన్నారు. ఒక్క అల్లూరు మండలంలోని గోగులపల్లి, ఇస్కపల్లి గ్రామాల్లోనే 5,000 ఎకరాల్లో ఉప్పు సాగు చేస్తున్నట్లు చెప్పారు. మంత్రి లోకేశ్ మాటను నిలుపుకొని అండగా ఉండాలని కోరారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 100	బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 204
లేయర్ (లైవ్) : 100	లేయర్ చికెన్ : 170
బ్రాయిలర్ చికెన్ : 184	



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.90
సన్నవి	: రూ.65
పండ్లు	: రూ.35



ఎద్దు పొడవడంతో..

- యువకుడి మృతి

నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని పొట్టేపాళెంలో నివాసం ఉంటున్న ఓ యువకుడిని ఎద్దు పొడవడంతో మృతిచెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పొట్టేపాళెంలో పున్నయ్య, రాజేశ్వరి దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి వెంకటేష్ (19) అనే కుమారుడు ఉన్నాడు. జననిబాబు అనే వ్యక్తికి చెందిన ఎద్దుల బండిని వెంకటేష్ నడుపుతున్నాడు. మంగళవారం వాటికి మేత వేసేందుకు వెంకటేష్ దగ్గరగా వెళ్లాడు. ఒక్కసారిగా ఎద్దు పొడవడంతో వెంకటేష్ నడుములోకి కొమ్ము దిగింది. అతడిని గ్రామస్తులు బొల్లినేని హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు యువకుడు మృతిచెందినట్లు నిర్ధారించారు.

పెంచలకోన బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టాలని నెల్లూరు ఆర్డీఓ అనూష ఆదేశించారు. ఏర్పాట్లపై ఆమె మంగళవారం మండల అధికారులతో కోనలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మే 9 నుంచి 14వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ డిపో మేనేజర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ రాపూరు, నెల్లూరు, రాజంపేట, బద్వేల్, కడప తదితర ప్రాంతాల నుంచి సుమారు 130 బస్సులు నడపనున్నట్లు వెల్లడించారు.

మహిళలు, చిన్నారుల గృహ నిర్బంధం



మల్లికార్జున్ కుటుంబ సభ్యులు

తోటపల్లిగూడూరు: బాకీ వసూలు విషయంలో మహిళలు, చిన్నారులను ఐదురోజులుగా గృహ నిర్బంధంలో ఉంచిన ఘటన మండలంలోని చింతోపు గ్రామంలో జరిగింది. లేబూరు కల్యాణి, లేబూరు మేఘ వర్షిత మంగళవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. తమ మామ లేబూరు మల్లికార్జున్ చింతోపు పంచాయతీ సర్పంచ్‌గా ఉన్నాడన్నారు. ఆయన గ్రామానికి చెందిన గండవరం అనిల్ – సంధ్యకు నగదు బాకీ ఉన్నట్లు చెప్పారు. దీనికి సంబంధించి కోర్టులో కేసు నడుస్తోందన్నారు. మామ, ఇతర కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయం చూసి ఐదు రోజులుగా అనిల్ – సంధ్య, మరికొందరు తమ ఇంటి వద్ద టెంట్ వేసి నిరసనకు దిగారన్నారు. తమను, పిల్లల్ని ఇంటి నుంచి బయటకు వెళ్లనివ్వకుండా గృహ నిర్బంధం చేశారన్నారు. కేసు కోర్టులో ఉంది కదా అనడిగితే తిడుతున్నారన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదన్నారు. మల్లికార్జున్ వైఎస్సార్‌సీపీ మద్దతు సర్పంచ్ కావడంతో రాజకీయంగా వేధిస్తున్నట్లు వాపోయారు.